సాక్షి మెదక్

సోమవారం ၊ 8 ၊ జూలై ၊ 2024



విస్తరణ ఇక్కట్లు..

రోడ్ల విస్తరణ పనులు చేర్యాల పట్టణ ప్రజలకు కొత్త సమస్య తెచ్చిపెట్టింది.

వివరాలు 8లో ▸



ఆషాఢం.. ప్రత్యేకం

ఆషాఢమాసం.. పల్లెలు, పట్టణాలు బోనాలెత్తుతున్నాయి. ఉరూ వాడా చల్లంగా ఉండాలని గ్రామ దేవతలకు వాటిని భక్తులు సమర్పిస్తారు.

వివరాలు 8లో ▸



ఎవరికీ పట్టని గ్రంథాలయం

లైబ్రరీ కొత్త భవనం నిర్మించినా పాఠకులకు ఇబ్బందులు పడుతున్నారు. అందులో పీఆర్ డివిజన్ కార్యాలయం కొనసాగుతుండటమే కారణమని తెలుస్తోంది.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

భగీరథ నీటి నాణ్యత పరిశీలన



బచ్చురాజ్‌పల్లిలో మహిళతో మాట్లాడుతున్న బృందం ప్రతినిధులు

నిజాంపేట(మెదక్): జల జీవన్ మిషన్ కేంద్ర బృందం సభ్యులు ఆదివారం మండల పరిధిలోని బచ్చురాజ్‌పల్లిలో మిషన్ భగీరథ నీటి నాణ్యతను పరిశీలించారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ నీటిని పరీక్షించారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదికను పంపుతామని వారు తెలిపారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ భిక్షపతి, జలజీవన్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, సామయ్య తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు రూ. 26 వేలకు పెంచాలి : అంగన్‌వాడీలు



కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీలు

మెదక్ కలెక్టరేట్: కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని అంగన్‌వాడీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సమ్మ మాట్లాడుతూ పెరిగిన ధరలకనుగుణంగా కనీస వేతనాలు రూ. 26 వేలకు పెంచాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష ఇవ్వాలని, వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగుల సమ్మె సందర్భంగా ఈ సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీ పట్ల కక్షపూరితంగా జీఓ 10 తీసుకు వచ్చిందని ఆరోపించారు. 65 సంవత్సరాలు దాటిన వారిని నిర్దాక్షణ్యంగా ఇంటికి పంపాలని నిర్ణయించడం దుర్మార్గమన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని డిమాండ్ చేశారు. జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలని, న్యాయమైన సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి ఇవ్వాల్సిన బెనిఫిట్స్ తక్షణం ఇవ్వాలన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి, టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు బీమా సొమ్ము ఇవ్వాల్సిందే



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దేవయ్య, మల్లేశం

మెదక్ కలెక్టరేట్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దేవయ్య, మల్లేశం డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఉన్న కేవలం కిషన్ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశానికి హాజరై వారు మాట్లాడారు. 6 గ్యారంటీల్లో భాగంగా పేదలకు పింఛన్లు, ఇళ్లు, గృహ స్థలాలు, కౌలు రైతులకు రూ.12వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, రైతు భరోసా డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. 38 మంది మత్స్య కార్మిక సంఘం సభ్యుల ప్రమాద బీమా సొమ్ము రూ. 2 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ విషయమై అధికారులకు, కలెక్టర్‌కు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనవరి 30, 31వ తేదీల్లో కలెక్టర్ కార్యాలయం ఎదుట బాధిత కుటుంబాలు నిరాహార దీక్షలు చేస్తే మత్స్యశాఖ అధికారి అక్కడికి చేరుకొని డబ్బులు చెల్లిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. కానీ ఇప్పటి వరకు చెల్లించలేదన్నారు. వెంటనే చెల్లించకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఐలయ్య, రామస్వామి, నరేందర్, నాగమణి, వెంకటి, యాదగిరి పాల్గొన్నారు.

పాదయాత్రను ప్రారంభించిన ఎంపీ

పటాన్‌చెరు టౌన్: బీజేపీ నేత పాదయాత్రను దక్ ఎంపీ రఘునందన్ ప్రారంభించారు. ఆదివారం ఐనోల్‌కు చెందిన బీజేపీ నేత రాచమల్ల సంతోశ్ గౌడ్ పటాన్‌చెరు నుంచి విజయవాడ వరకు పాదయాత్ర చేపడుతుండగా ఆయన ప్రారంభించారు. తొలుత మహంకాళి ఆలయంలో పూజలు జరిపారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, బైండ్ల కుమార్, శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.



శాకాంబరిగా భక్తులకు దర్శనమిస్తున్న దుర్గమ్మ

శాకాంబరిగా దుర్గమ్మ



ఆలయ ఆవరణలో భక్తులు

పాపన్నపేట(మెదక్): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం ఏడుపాయల వనదుర్గమ్మ శాకాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామునే అర్చకులు పార్థివశర్మ, శంకర శర్మలు అమ్మను వంకాయలు, ఆలుగడ్డ, క్యాప్సికం, క్యారెట్ , బీట్‌రూట్, పచ్చిమిర్చి, బెండ, దొండకాయలు, ఎండుమిర్చి, నిమ్మకాయ, బీర్నీస్, క్యాబేజీ, గుమ్మడికాయ, సోర, దోసకాయ, కిర, మొక్కజొన్న, అరటి, కొత్తిమీర, కరివేపాకు తదితర కూరగాయలతో అలంకరించారు. శాకాంబరిగా దర్శనమిస్తున్న అమ్మను భక్తులు చూసి తరించారు. పూజలు చేసి అమ్మకు ఒడి బియ్యం పోసి, బోనాలు తీసి మొక్కులు తీర్చారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఏడుపాయల జనసంద్రంగా మారింది. కాటేజీలు దొరక్క చెట్ల కింద టెంట్లు వేసుకొని భక్తులు విందులు చేసుకున్నారు. వాతావరణం సహకరించడంతో సరదాగా గడిపారు.



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కరుణామయా.. కరుణించు



దైవసందేశాన్ని ఇస్తున్న శాంతయ్య

మెదక్‌జోన్: కరుణామయ నీవే మా తోడు.. నీడ అంటూ భక్తులు యేసును ప్రార్థించారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రెండు పర్యాయాలు ప్రార్థనలు జరిగాయి. చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య భక్తులనుద్దేశించి దైవ సందేశాన్ని ఇచ్చారు. మతగురువు శ్రీనివాస్ ప్రార్థనలు చేశారు. కాగా దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

మెదక్‌లో రాహుల్‌రాజ్

పాలనపై కలెక్టర్ మార్క్

- అధికారులు స్థానికంగా ఉండాలని ఆదేశం
- తరుచూ క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే..
- కలెక్టరేట్‌లోని 17 శాఖలు డిజిటలైజేషన్
- ఇంటిగ్రేటెడ్ కార్యాలయంలో ప్లాస్టిక్ నిషేధం
- కుటుంబంతో కలిసి ఆర్టీసీలో ప్రయాణం

అధికారులు ప్రజలకు జవాబుదారిగా ఉండాలని ఈ–ఆఫీస్ కార్యాలయం ప్రారంభించారు. పనింతా పూర్తిగా డిజిటలైజేషన్ చేశారు. అందులో ప్రతి ఫైల్ భద్రం చేయనున్నారు. అలాగే ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించనున్నారు. జిల్లాస్థాయి సమస్య అయితేనే కలెక్టరేట్‌కు వచ్చేలా అవగాహన కల్పిస్తున్నారు. స్థానికమైతే అక్కడికక్కడే అధికారులు పరిష్కారాన్ని చూపనున్నారు. కలెక్టర్ కార్యాలయంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించారు.

కాగా, ప్రతి సోమవారం ప్రజావాణి మినహా మిగతా రోజుల్లో మండల కేంద్రాలు, గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీలు చేస్తున్నారు. నేరుగా ప్రజలతో మాట్లాడుతూ సమస్యలపై ఫోకస్ పెట్టారు. బడిబాటపై ప్రత్యేక శ్రద్ధ వహించి జిల్లా అధికారులు, తాను పల్లెనిద్ర సైతం చేశారు. కలెక్టర్‌గా రాహుల్‌రాజ్ బాధ్యతలు స్వీకరించిన ఐదు నెలల్లోనే జిల్లాపై తన మార్క్ పాలన అందజేస్తున్నారు.

మెదక్‌జోన్: కలెక్టర్‌గా రాహుల్‌రాజ్ ఆదిలాబాద్ నుంచి మెదక్‌కు బదిలీపై వచ్చారు. లోక్‌సభ ఎన్నికల ముందు ఫిబ్రవరి 6న బాధ్యతలు స్వీకరించిన రోజే జిల్లా అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి అంతా నిబద్ధతతో, నిజాయితీగా విధులు నిర్వర్తించాలి. అధికారులందరూ స్థానికంగా ఉండాలి. జిల్లా దాటి వెళితే అనుమతులు తప్పనిసరి. తాను ఇక్కడ పనిచేసిన అంత కాలం అవినీతికి తావు ఉండకూడదంటూ అధికారులకు కచ్చితమైన సంకేతాలు పంపారు.

వర్క్ అంతా ఆన్‌లైన్‌లోనే..

కలెక్టరేట్‌లో చేసే ప్రతి పనీ ఆన్‌లైన్‌లోనే జరగాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మొత్తం 30కి పైగా శాఖలు ఉండగా ఈనెల 3న 17 శాఖల్లో ఈ–ఆఫీస్ ప్రారంభించారు. దీంతో ప్రతిదీ జవాబుదారిగా ఉండాలన్నారు. ఆగస్టు 15వ తేదీ వరకు అన్నిశాఖల్లో పూర్తిస్థాయిలో డిజిటల్‌లోనే పని చేయాలని ఆదేశించారు. స్వయంగా ఆయనే ఈ–ఆఫీస్‌ను ప్రారంభించారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రతి ఫైల్ స్కాన్ చేసి ఈ–ఆఫీస్‌లో భద్ర పరుస్తున్నారు.

ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లోనూ ప్రజావాణి

ఇక నుంచి ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి ఆయా ఆర్డీఓ కార్యాలయాలు, మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లోనూ నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్, ఆర్డీఓ స్థాయిలో పరిష్కరించే సమస్య ఉంటే అక్కడే పరిష్కరించమన్నారు. జిల్లా స్థాయి సమస్య అయితేనే కలెక్టరేట్‌కు ప్రజలను పంపాలన్నారు. ఇది ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కల్పించాలన్నారు.



తన భార్య పిల్లలతో ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్ (ఫైల్)

సొంత పనులకు ప్రభుత్వ వాహనం దూరం

కలెక్టర్ రాహుల్‌రాజ్ తన సొంత పనులకు ప్రభుత్వ వాహనాన్ని వినియోగించరు. సెలవు రోజుల్లో తన భార్యాపిల్లలతో సరదాగా గడపాలనుకుంటే మాత్రం ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్నారు. ఆయన సతీమణి ఓ బ్యాంక్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు.

ప్లాస్టిక్ నిషేధం

కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ బాటిల్ నీటిని తీగవద్దు. అధికారులందరూ స్టీల్‌వాటర్ బాటిళ్లు తెచ్చుకోవాలి. కలెక్టరేట్‌లో ఫస్ట్, సెకండ్ ఫ్లోర్‌లలో తాగునీటి కోసం వాటర్ ఫిల్టర్ల అందుబాటులోకి వస్తాయి. మీటింగ్‌లలో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, కవర్ల వినియోగంపై నిషేధించారు కలెక్టర్.



చిన్నారులతో అక్షరభ్యాసం చేయిస్తున్న కలెక్టర్ రాహుల్ (ఫైల్)

బడిబాట.. పల్లెనిద్ర

జూన్ 6 నుంచి 19వ తేదీ వరకు జరిగిన బడిబాటపై కలెక్టర్ ప్రత్యేక ఫోకస్ పెట్టారు. ''చిట్టిపొట్టి అడుగులు చిత్రమైన మాటలు తల్లి చెంత చింతలేని చిన్నారి నవ్వులు'' అనే పాటను స్వయంగా రచించారు. పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఆయన సమావేశాన్ని నిర్వహించి గ్రామాల్లో బడీడుపిల్లలందరినీ బడిలో చేర్పించాలన్నారు. జిల్లాస్థాయి అధికారులతో పల్లె నిద్ర చేయించారు. సర్దాపూర్ మండలంలోని ఓ గ్రామంలో తాను సైతం పల్లెనిద్ర చేశారు. మెదక్ మండలం మక్తభూపతీపూర్‌లో ఏకంగా అక్షరభ్యాసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి స్వయంగా చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. జిల్లాలో 7,693 మందిని నూతనంగా సర్కారు బడుల్లో చేర్పించారు.

చెట్లు నాటడం అభినందనీయం

సెషన్స్ కోర్టు జిల్లా జడ్జి లక్ష్మీశారద



నడిమితండాలో మొక్కలు నాటుతున్న సెషన్స్ కోర్టు జిల్లా జడ్జి లక్ష్మీశారద

చేగుంట(తూప్రాన్): ఆడపిల్లల పేరుతో చెట్లను నాటడం గొప్ప విషయమని సెషన్స్ కోర్టు మెదక్ జిల్లా జడ్జి లక్ష్మీశారద అన్నారు. మాసాయిపేట మండలం నడిమితండాలో డాక్టర్ శిల్పిరెడ్డి ఫౌండేషన్ గ్రో బ్రిలియన్ ట్రీస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై ఆమె మాట్లాడారు. గ్రామాల్లో మహిళల హక్కులు, ఆడపిల్లలు, యువతుల చదువులపై ఇంకా అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అనంతరం డాక్టర్ శిల్పిరెడ్డి మాట్లాడుతూ ఆరు నెలల్లో తమ కిమ్స్ కడల్ ఆస్పత్రిలో జన్మించిన 250 మంది ఆడపిల్లల పేరిట 250 మామిడి మొక్కలను నడిమితండాలో నాటుతున్నట్లు పేర్కొన్నారు. గర్ల్ వన్ ట్రీ వన్.. వన్ నేషన్ గ్రీన్ నేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాప, బాబు ఇద్దరు సమానమేనని చాటి చెప్పడానికి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. తమ సంస్థ నాటిన మామిడి మొక్కలతో గిరిజనులు మూడేళ్ల తర్వాత ఉపాధిని సైతం పొందాలనే ఆలోచనతో నాటుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సివిల్ జూనియర్ జడ్జి రీటాలాల్‌చంద్, గ్రో బ్రిలియన్ ట్రీస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తండా వాసులు పాల్గొన్నారు.

అసమానతలను పారదోలుదాం



ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు

మెదక్ మున్సిపాలిటీ: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం పార్టీ నాయకులు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. రామ్ దాస్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మలిశెట్టి రవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంటరానితనం, సమాజంలో ఉన్న అసమానతలు పారదోలి ఆత్మగౌరవ హక్కుల సాధనకు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో చేసిన దండోరా ఉద్యమాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. 59 ఉపకులాల ప్రజల హక్కుల కోసం ఏబీసీడీ వర్గీకరణ ఉద్యమం చేపట్టి 30 ఏళ్ల పూర్తయిందన్నారు. ఈనెల 22 నుంచి జరిగే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో షెడ్యూల్ కులాల రాజ్యాంగ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత కోసం పెట్టే బిల్లు ఆమోదం తెలపాలన్నారు. వర్గీకరణకు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు సామెల్, కొమ్ముశేకులు, శంకర్, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే మేధోసంపత్తి

రాష్ట్ర పౌర గ్రంథాలయాల సంచాలకుడు ఏవీఎన్ రాజు

గజ్వేల్‌రూరల్: పుస్తక పఠనంతో మేధోసంపత్తి పెరుగుతుందని రాష్ట్ర పౌర గ్రంథాలయాల సంచాలకుడు ఏవీఎన్ రాజు అన్నారు. గజ్వేల్‌లోని శాఖ గ్రంథాలయాన్ని ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లైబ్రరీలోని రికార్డులు, పుస్తకాలను పరిశీలించారు. ఎంతమంది పాఠకులు వస్తున్నారని స్థానిక లైబ్రేరియన్ తిరుపతి రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏవీఎన్ రాజు మాట్లాడుతూ భవిష్యత్‌లో గ్రంథాలయాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే దశల వారీగా అమలు చేస్తామన్నారు. ప్రజలు గ్రంథాలయాల్లో అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా ఏవీఎన్ రాజుకు స్థానిక లైబ్రేరియన్ శాలువా కప్పి సన్మానించారు.




రికార్డులను పరిశీలిస్తున్న ఏవీఎన్ రాజు

సద్వినియోగం చేసుకోండి..

ములుగు(గజ్వేల్): గ్రంథాలయాల సేవలను పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పౌర గ్రంథాలయాల సంచాలకుడు ఏవీఎన్ రాజు సూచించారు. ఆదివారం ములుగు శాఖ గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనంతోనే విజ్ఞానం పెంపొందుతుందని అన్నారు. గ్రంథాలయాల్లోని పుస్తకాలను విద్యార్థులు, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గుట్టుగా గుట్కాల దందా

- యథేచ్ఛగా విక్రయాలు
- జిల్లావ్యాప్తంగా లక్షల్లో వ్యాపారం
- పట్టించుకోని అధికారులు



గుట్కాలు, ఖైనీలు (ఫైల్)

తూప్రాన్: గుట్టుగా గుట్కాల దందా కొనసాగుతోంది. పాన్‌పరాగ్, జర్దా, ఖైనీ వంటిని తయారీదారులు నేరుగా నిర్వాహకులకు విక్రయిస్తున్నారు. దీంతో విచ్చలవిడిగా దొరుకుతున్నాయి. దీంతో ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్నచందంగా నడుస్తోంది. అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

మెదక్ జిల్లాలో గుట్కాల వ్యాపారం జోరుగా సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో కిరాణా దుకాణాల నిర్వాహకుల వద్దకు వ్యాపారులు వెళ్లి గుట్కాలు, ఖైనీలు, పాన్‌పరాగ్‌లను విక్రయిస్తున్నారు. దీంతో పాన్ షాపులు, కిరాణా దుకాణాలు, హోటళ్లతోపాటు అన్ని దుకాణాలు, వ్యాపార సంస్థల్లో లభిస్తున్నాయి. దాన్ని అడ్డుకోవాల్సిన అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో తయారీ సంస్థలు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు అప్రమత్తమై దుకాణాల్లో పెద్దెత్తున నిల్వ చేస్తున్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నెలకు సుమారుగా రూ.లక్షల్లో హోల్‌సేల్, రిటైల్ దందా నడుపుతున్నట్లు సమాచారం. గ్రామీణ ప్రాంతాల్లో రోజుకు 300 నుంచి 400 వరకు ఖైనీ, గుట్కాలను అమ్ముతున్న వ్యాపారులు కూడా ఉన్నారు. ఒక్కరే రోజూ 20 నుంచి 30 ప్యాకెట్ల వరకు వినియోగిస్తున్నారు. మండలంలో అధికంగా పరిశ్రమలు ఉన్నాయి.. ఇతర రాష్ట్రాల వారు కొంతమంది ఇక్కడికే వలసొచ్చి జీవనోపాధి పొందుతున్నారు. వీరు అధికంగా గుట్కాలను నములుతున్నారు. వాహనాల డ్రైవర్లు, కూలీలు, కార్మికులు సైతం వాడుతున్నారు. ఎక్కువ దూరం ప్రయాణిస్తున్న సమయంలో నిద్రమత్తులోకి జారుకోకుండా గుట్కాలను వాడుతున్నట్లు చెబుతుండటం విడ్డూరం.

గుట్కాలు హానికరం



గుట్కాలు, జర్దాలు వినియోగిస్తే ఆరోగ్యం క్షీణిస్తుంది. దంతాలు పాడైపోయి, చిగుళ్లకు పుండ్లు తయారవుతాయి. ఫలితంగా క్యాన్సర్ వస్తుంది. అంతే కాకుండా అనేక రకాల జబ్బులు వచ్చే అవకాశం ఉంది. తినే ఆహారం సైతం రుచించదు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండడం మంచిది.

– డాక్టర్ సురేశ్, దంత వైద్య నిపుణులు

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయిలో పతకాలు


అమృత, విశ్వతేజ

సిద్దిపేటజోన్: హైదరాబాద్ గచ్చిబౌలి గోపిచంద్ స్టేడియంలో ఆదివారం జరిగిన రెండవ రాష్ట్ర స్థాయి కిడ్స్ చాంపియన్స్ టోర్నీలో అథ్లెటిక్స్ విభాగంలో జిల్లాకు రెండు పతకాలు లభించాయి. అండర్ 12 లాంగ్ జంప్ విభాగంలో అమృత వెండి పతకం, అండర్ 12 బాలుర 100 మీటర్ల పరుగులో విశ్వతేజ కాంస్య పతకం సాధించారు. వీరిని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి వెంకట్ స్వామి అభినందించారు.

వర్గీకరణ సాధనకు రాజీలేని పోరాటం

ఎమ్మార్పీఎస్ పొలిట్‌బ్యూరో సభ్యుడు రాములు మాదిగ


నినాదాలు చేస్తున్న నాయకులు

గజ్వేల్: ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ సాధనకు రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామని ఎమ్మార్పీఎస్ పొలిట్‌బ్యూరో సభ్యులు మైస రాములు మాదిగ అన్నారు. ఆదివారం గజ్వేల్‌లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండావిష్కరణ చేపట్టారు. ఆ తర్వాత ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందక్రిష్ణ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మైస రాములు మాట్లాడుతూ.. మందక్రిష్ణ మాదిగ కృషి వల్ల దండోరా ఉద్యమం జాతి ప్రయోజనాలే కాకుండా, సామాజిక ప్రయోజనాలెన్నో నెరవేర్చేలా చేసిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గజ్వేల్ మండల శాఖ అధ్యక్షుడు ఉబ్బని ఆంజనేయులు, సీనియర్ నాయకులు బెజుగామ యాదగిరి, ఎంఎస్పీ నాయకులు శ్రీహరి, నాయకులు జాలని బల్‌రామ్, సుధాకర్, బొమ్మని మహేశ్, అశోక్, రవి,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు కల్పించండి

ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజలింగం


సమావేశంలో నాయకులు

సిద్దిపేటజోన్: రాష్ట్రంలో 61 ఏళ్ల నిండిన వీఆర్‌ఏల కుమారులను వీఆర్‌ఏలుగా గుర్తించి రెగ్యూలర్ చేయాలని 61 ఏళ్ల వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజలింగం అన్నారు. ఆదివారం సిద్దిపేటలోని ఆర్డీఓ కార్యాలయంలో వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాజలింగం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రాష్ట్రంలోని 20,555 మంది వీఆర్‌ఏలలో జీఓ నంబర్ 81, 85 ప్రకారం 16,758 మందిని వీఆర్‌ఏలను రెగ్యూలర్ చేశారన్నారు. మిగిలిన 61 ఏళ్ల పైబడిన 3,797 మంది వీఆర్‌ఏలను పక్కన పెట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారిని గుర్తించి రెగ్యూలర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నర్సింలు, రాజు, శ్రీనివాస్, రాజు, ప్రవీణ్ కుమార్, భిక్షపతి, పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఏడుగురిపై కేసు నమోదు

కంగ్టి (నారాయణఖేడ్): కంగ్టి మండలంలోని ముర్కుంజాల్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. దాడిలో ఏడుగురు పట్టుపడగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విశ్వజన్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.20 వేల నగదు, 5 బైక్‌లు, 5 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకు న్నట్లు పేర్కొన్నారు.

విస్తరణ ఇక్కట్లు..

- నిలిచిన సైడ్ డ్రైన్ పనులు
- ఎక్కడికక్కడ పేరుకుపోయిన మురుగు
- ఆరు మాసాలుగా వెలగని సెంట్రల్ లైటింగ్
- అంధకారంలో చేర్యాల పట్టణం
- పట్టించుకోని మున్సిపల్, జాతీయ రహదారి విస్తరణ అధికారులు


డ్రైన్ నుంచి రోడ్డుపైకి పారుతున్న మురుగు నీరు

చేర్యాల(సిద్దిపేట): రోడ్ల విస్తరణతో ప్రజలకు మేలు జరుగుతుంది అన్న మాట అటుంచితే చేర్యాల పట్టణ ప్రజలకు మాత్రం కొత్త సమస్య తెచ్చిపెట్టింది. ఇందుకు పట్టణ కేంద్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులే నిదర్శనం. సూర్యాపేట – సిరిసిల్ల 365బీ జాతీయ రహదారిలో భాగంగా జనగామ నుంచి దుద్దెడ వరకు నాలుగు లైన్ల రోడ్డు విస్తరణకు పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంలో దుద్దెడ క్రాస్‌రోడ్డు నుంచి జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులు ఏడు నెలల కిందట పట్టణ కేంద్రంలో ప్రారంభమయ్యాయి.

మొదట రోడ్డు మీద పడ్డ నీరు వెళ్లేందుకు రోడ్డుకు ఇరు వైపులా సైడ్ డ్రైన్ నిర్మాణ పనులు మొదలుపెట్టారు. మొదట్లో పనులు వేగంగా జరిగినట్లే అనిపించినా అక్కడక్కడా విద్యుత్ స్తంభాలు అడ్డు రావడంతో డ్రైన్ పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. అసంపూర్తిగా ఉన్న డ్రైన్‌లోకి ఇళ్లల్లో నుంచి వచ్చే మురికి నీటి నాలాలు కలిపారు. కానీ డ్రైన్ పనులు ఆగిన చోట మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. వర్షం పడితే పరిస్థితి మరీ అధ్వానంగా ఉంటుంది. అక్కడి నుంచి వెలువడే మురుగు వాసన,


వెలగని సెంట్రల్ లైట్లు

దోమలతో వ్యాపారస్తులు, పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రధాన రహదారి చీకటిమయం

ఇది ఇలా ఉంటే రోడ్డు విస్తరణ పనుల కారణంగా పట్టణ కేంద్రంలోని సెంట్రల్ లైటింగ్ సుమారు ఆరు నెలలుగా వెలగడం లేదు. దీంతో ప్రధాన రహదారి చీకటి మయంగా మారింది. రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. మంగళవారం జరిగే వారాంతపు సంత సందర్భంగా సెంట్రల్ లైటింగ్ వెలగకపోవడంతో రోడ్లపై కూరగాయలు విక్రయించే, కొనుగోలు చేసే వారు ఇబ్బంది పడుతున్నారు. అయినా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయన్న ఆనందం కన్నా ప్రస్తుతం నెలకొన్న సమస్య పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు. మున్సిపల్, రహదారి విస్తరణ అధికారులు స్పందించి వెంటనే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్యుత్ స్తంభాల తరలింపు ఆలస్యం కావడంతో డ్రైన్ పనులు ఆగిపోయాయి. డ్రైన్ పూర్తి అయితేనే రహదారి విస్తరణ పనులు కొనసాగే అవకాశం ఉంది.

మురుగుతో ఇబ్బంది పడుతున్నాం



రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా చేపట్టిన డ్రైన్ నిర్మాణం పూర్తి చేయకపోవడంతో డ్రైన్‌లో పేరుకుపోయిన మురుగు నుంచి దుర్వాసన వెదజల్లుతోంది. దోమల వ్యాప్తితో దుకాణాల్లో ఉండలేకపోతున్నాం. దీనిపై మున్సిపల్, జాతీయ రహదారి విస్తరణ అధికారులు స్పందించి వెంటనే పనులు పూర్తి చేయాలి.

–చేతిరెడ్డి సందీప్‌రెడ్డి, ఎరువుల వ్యాపారి

కాంట్రాక్టరే లైటింగ్ ఏర్పాటు చేస్తాలి



రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా సెంట్రల్ లైటింగ్‌కి సంబంధించిన విద్యుత్ వైర్లు పూర్తిగా దెబ్బతినడంతో లైటింగ్ సరిగా పనిచేయడం లేదు. డివైడర్ నిర్మాణం పూర్తి చేసి లైటింగ్ కూడా రోడ్డు పనులు చేస్తున్న వారే ఏర్పాటు చేస్తారు.

–గోల్కొండ నర్సయ్య, ఇన్‌చార్జి కమిషనర్

త్వరలోనే పూర్తి చేస్తాం

డ్రైన్ పనుల్లో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాల కారణంగా పనులు ఆలస్యమవుతున్నాయి. ప్రస్తుతం విద్యుత్ స్తంభాల తరలింపు పనులు కొనసాగుతున్నాయి. స్తంభాలన్నీ తరలించి డ్రైన్ పనులు పూర్తి చేసి, వెంటనే సెంట్రల్ లైటింగ్ పనులు కూడా పూర్తి చేస్తాం. ఇవి పూర్తి అయితే జాతీయ రహదారి విస్తరణ పనులు మొదలవుతాయి.

–రాజారాం, ఎన్‌హెచ్ డీఈఈ

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య


కనకయ్య (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ఆదివారం చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, మిరుదొడ్డి ఎస్‌ఐ బోయిని పరుశరాములు కథనం మేరకు.. గ్రామానికి చెందిన ధర్మారం కనకయ్య (58)కు భార్య సత్తవ్వ, కుమారుడు రాజు, కూతురు దీపిక ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కూతురు భర్తతో విభేదాల కారణంగా పుట్టింటి వద్దే ఉంటోంది. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో కనకయ్య సతమతవుతున్నాడు. శనివారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం స్థానిక ఎస్సీ హాస్టల్ సమీపంలోని గొర్ల కొట్టంలో కనకయ్య ఉరి వేసుకొని కనిపించాడు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జీవితంపై విరక్తితో వివాహిత..


రీనా మృతదేహం

పటాన్‌చెరు టౌన్: వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని పీజేఆర్ ఎంక్లేవ్ మాధవపురి హిల్స్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఉండే రీనా(30)కు మూడున్నరేళ్ల కిందట మేడి శెట్టి సాయి అనే వ్యక్తితో ప్రేమ వివాహమైంది. ఏడాది తర్వాత ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకున్నారు. రీనా వర్క్ ఫ్రమ్ హోం నైట్ డ్యూటీ చేస్తూ ఇంట్లోనే ఉంటుంది. ఈనెల 5వ తేదీ రాత్రి భోజనం చేసి తన గదిలోకి వెళ్లింది. మరుసటి రోజు తల్లి సక్కుబాయి తలుపులు తట్టి పిలవగా పలకలేదు. భర్త శ్రీనివాస్, కుమారుడు సతీశ్ సాయంతో తలుపులు బద్దలు కొట్టి లోనికి వెళ్లి చూడగా బెడ్‌పై స్పృహ లేకుండా పడి ఉంది. ఏవో ట్యాబ్లెట్లు మింగినట్లు గమనించి ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కూతురు తరచూ విడాకుల విషయంలో బాధపడుతూ ఉండేదని, భరించలేక జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకుందని తండ్రి శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మృతదేహం లభ్యం

శివ్వంపేట(నర్సాపూర్): గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామ శివారులో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. 35 నుంచి 40 ఏళ్లలోపు ఉన్న వ్యక్తి చిన్నగొట్టిముక్ల గ్రామ పరిధిలోని కుమ్మరి వాణి కుంట వద్ద చెట్టుకు ఉరి వేసుకున్నాడు. పూర్తిగా కుళ్లిపోయి గుర్తు పట్టకుండా ఉన్న స్థితిలో ఆదివారం మృతదేహాన్ని పశువుల కాపరులు గుర్తించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. గ్రామ కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


రమేశ్ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధి కొంతన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన అరికెల రమేశ్(42) శనివారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం ఉదయం ఆచూకి కోసం గ్రామ పరిసరాల్లో వెతుకుతున్న క్రమంలో ఇంటి ఎదుట గుడిసెలో అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకొని కనిపించాడు. మృతుడి భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

హవేళిఘణాపూర్(మెదక్): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మెదక్ మండల పరిధిలోని రాజ్‌పల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన రైతు మార్గం యాదగిరి(50) ఆదివారం ఉదయం వెంకటాపూర్ శివారులో ఉన్న పొలం వద్దకు నీరుపార పెట్టేందుకు వెళ్లాడు. బోరుకు కరెంటు రాకపోవడం రిపేరు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. కరెంటు షాక్ తగిలి పడిపోయాడు. ఎంతసేపు అయినా యాదగిరి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా కిందపడిపోయి ఉన్నాడు. ఆయన్ను వెంటనే మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ఘటనా స్థలాన్ని మెదక్‌రూరల్ ఎఎస్‌ఐ శివకుమార్ సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయిస్తున్న రెవెన్యూ అధికారులు

ఆక్రమిత ప్రభుత్వ భూమి గుర్తింపు

- హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు
- సంబురాలు జరుపుకున్న గ్రామస్తులు

కొండపాక(గజ్వేల్): ఎట్టకేలకు కొండపాక మండలంలోని ఖమ్మంపల్లి శివారులో సర్వే నంబరు 1061లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు గుర్తించి ఆదివారం ప్రభుత్వ భూమి అంటూ బోర్డును పెట్టారు. సుమారు 7 నెలల పోరాటం అనంతరం సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు సంబురాలు జరుపుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మర్పడ్గ రెవెన్యూ పరిధిలో ఖమ్మంపల్లి గ్రామ శివారులో 135 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో కొంత భూమిని ప్రభుత్వం అసైన్ చేయగా సుమారు 10 ఎకరాల భూమిని ఖమ్మంపల్లి గ్రామ అవసరాలకు కేటాయిస్తూ హద్దులు పెట్టాలంటూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెవెన్యూ అధికారులకు ఆదేశాలిచ్చింది.

ఆక్రమించుకొని వ్యవసాయం పనులు

రెవెన్యూ అధికారులు జాప్యం చేయడాన్ని ఆసరాగా చేసుకున్న పక్క మండలానికి చెందిన కొందరు ప్రభుత్వ భూమిని కొంత ఆక్రమించుకున్నారు. అందులో వ్యవసాయ పనులు మొదలు పెట్టగా ఖమ్మంపల్లి గ్రామస్తులు అడ్డుతగులడంతో ఆక్రమిత దారులకు, గ్రామస్తులకు పెద్ద ఎత్తున గొడవలు జరిగాయి. ఈ విషయమై పలుమార్లు సాక్షి దినపత్రికలో కథనాలను ప్రచురించింది. రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేదు. తాజా మాజీ ఎంపీటీసీ యాదగిరితోపాటు గ్రామస్తులు 2024 ఫిబ్రవరిలో హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో వినతిపత్రం ద్వారా ఫిర్యాదు చేశారు. స్పందించిన ప్రజాభవన్ వేదక వెంటనే పూర్తి స్థాయిలో ఎంక్వైరీ చేసి రిపోర్టును అందజేయాలంటూ సిద్దిపేట కలెక్టర్ కార్యాలయానికి లేఖను పంపింది.

35 ఎకరాలు గుర్తింపు..

కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ బన్సీలాల్, తహసీల్దార్ దిలీప్ నాయక్‌ల సూచనల మేరకు కబ్జాకు గురైన 35 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. ఇది ప్రభుత్వ భూమి అంటూ ఆర్ఐ బాలకిషన్ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో సంబురాలు జరుపుకున్నారు. కబ్జాకు గురైన భూమి ప్రభుత్వం స్వాధీనం చేసుకునేలా కృషి చేసిన అధికారులకు, సాక్షి పత్రికా యాజమాన్యానికి, సిబ్బందికి, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పత్తి చేనులో కలుపు తీసి వస్తుండగా..

కారు ఢీకొని మహిళ మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

టేక్మాల్(మెదక్): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం టేక్మాల్ మండలం కదిలబాయితండాకు చెందిన దేవసోత్ లాడ్కిబాయి(55) వ్యవసాయ పనులతోపాటు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంది. కూలీ పనుల నిమిత్తం బొడ్మట్‌పల్లికి పత్తి చేనులో కలుపు తీయడానికి వచ్చింది. పని ముగించుకొని ఇంటి వెళ్తే సమయంలో 161 హైవే దాటుతుండగా కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై లాడ్కిబాయి అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ మురళీ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారును అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు..

మిరుదొడ్డి(దుబ్బాక): నీట మునిగి మత్స్యకారుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కాసులాబాద్‌లో ఆదివారం చోటు చేసుకుంది. మిరుదొడ్డి ఎస్‌ఐ బోయిని పరుశరాములు కథనం మేరకు.. గ్రామానికి చెందిన కంది చంద్రయ్య (70) గ్రామ శివారులోని పెద్ద చెరువులో చేపల వేటకు వెళ్లాడు. చెరువులో వల విసురుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు వల కాళ్లకు చుట్టుకోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి కోడలు యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..


బాలకృష్ణయ్య

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఇబ్రహీంపూర్ శివారులో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాలరాజు కథనం మేరకు.. నార్సింగి మండలం భీంరావుపల్లి గ్రామానికి చెందిన పుల్లగల్ల బాలకృష్ణయ్య(60) టీవీఎస్ మోపెడ్‌పై బీ కొండాపూర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఇబ్రహీంపూర్ శివారులోని మలుపు వద్ద మోపెడ్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు గాయాలై బాలకృష్ణయ్యను తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతుడి కుమారుడు సందీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టు నిమిత్తం తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెరువులో మునిగి వృద్ధుడు..

వర్గల్(గజ్వేల్): ప్రమాదవశాత్తు చెరువులో మునిగి వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం వర్గల్ మండలం చౌదరిపల్లిలో వెలుగుచూసింది. గౌరారం ఎస్‌ఐ శివకుమార్ కథనం మేరకు.. చౌదరిపల్లికి చెందిన బండి సాయిలు(65)కు మతిస్థిమితం సరిగా లేదు. భార్య ముత్యాలు, కుమారుడు రమేశ్ ఉన్నారు. గురువారం రాత్రి ఇంట్లో భోజనం చేసి నిద్రబోయిన సాయిలు శుక్రవారం ఉదయం 6 గంటల తర్వాత కనపడలేదు. కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఆచూకీ తెలియరాలేదు. ఆదివారం గ్రామ సమీప బంధం చెరువులో సాయిలు మృతదేహం తేలడంతో స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తన తండ్రి కాలకృత్యాలకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడని కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆషాఢం.. ప్రత్యేకతల సమాహారం

- ఇక ఊరువాడా బోనాల సందడి
- ఆడబిడ్డల చేతులపై అందమైన ముగ్గులు
- పంటలు పండాలని పూజలు
- ఊపందుకున్న వ్యవసాయం పనులు
- గ్రామాల్లో పండుగ వాతావరణం



జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉపందుకునే వ్యవసాయ పనులు.. ఎటూ చూసిన పచ్చని పంటలు. ఆడబిడ్డల అరచేతులపై అందమైన ముగ్గులు.. దేవుడి లాంటి భర్త దొరకాలని కోరుకునే ఆడపిల్లల ఆకాంక్షలు.. కొత్త జంటు దూరంగా.. పంటలు బాగా పండాలని.. పిల్ల జెల్లా బాగుండాలని.. ఊరువాడా చల్లంగుండాలని గ్రామ దేవతలకు భోనాల సందడి.. ఇలా ఎన్నెన్నో విశేషాలతో కూడుకున్నదే ఆషాఢమాసం.. ఈ మాసంలో పల్లెలు, పట్టణాలు బోనాలతో మార్మోగుతాయి. నెల రోజుల పాటు గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపిస్తుంది. శనివారం నుంచి ప్రారంభమైన ఆషాఢమాసం గురించి ప్రత్యేక కథనం..

బోనం.. అమ్మవారికి నైవేద్యం

బోనం అంటే అమ్మవారి నైవేద్యం, మహిళలు వండిన అన్నంతోపాటు బెల్లంతో నైవేద్యం తయారు చేస్తారు. బోనాల ఊరేగింపులో పోతరాజుల ఆటపాటలు, శివసత్తుల విన్యాసాలు, యువకుల నృత్యాలు ఆకట్టుకుంటాయి. పూర్వ కాలంలో పండుగ రోజు దుష్టశక్తులను పారదోలడానికి బోనంతో పాటు దున్నపోతును బలిచ్చే వారు. ఇప్పుడు మేకలు, గొర్రెలు, కొడిపుంజులను బలి ఇవ్వడం ఆనవాయితీగా మారింది.

వన భోజనాల సందడి..

గ్రామీణ ప్రాంతాల్లో వన భోజనాలు సందడి నెలకొంటుంది. గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు మొక్కుతారు. పాడి పంటలు పండి అందరూ బాగుండాలని గ్రామ దేవతల వద్ద వనభోజనాలకు వెళ్తారు. అమ్మవారికి బోనం సమర్పించిన అనంతరం అక్కడే భోజనాలు వండి కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి వంటలు చేసి భుజిస్తారు.

అరచేతిలో అందమైన ముగ్గులు..



కొత్తగా పెళ్లయిన యువతులు ఆషాఢమాసం ప్రారంభం కాగానే తప్పనిసరిగ పుట్టింటికి వెళ్తారు. చేతులకు గోరింటాకు పెట్టి అది ఎంత బాగా పండితే వారి జీవితం అంత బాగుంటుందని, సుఖ కాంతులో వర్ధిలుతారని నమ్మకం. గతంలో గ్రామాల్లో ప్రకృతి పరంగా గోరింటాకు పెట్టుకునే వారు. కాలక్రమేణా గోరింటాకు కనుమరుగై దాని స్థానంలో మోహిందీ వాడటం ప్రారంభమైంది.

ఎవుసం పనులకు ఊపు..

ఆషాఢమాసం ప్రారంభానికల్లా రైతులు దుక్కులు దున్నడం, విత్తనాలు చల్లడం వంటి వ్యవసాయ పనులన్నీ పూర్తి చేస్తారు. తొలకరి జల్లులు కురవగానే వ్యవసాయ పనులను వేగవంతం చేస్తారు. ఈ మాసం ముగిసే వరకు రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా గడుపుతారు. ఎక్కువగా వరి సాగు పనులు జరుగుతాయి.




అత్తా కోడళ్లకు ఎడబాటు..

ఆషాఢ మాసంలో అత్తత్తాకోడళ్లు ఒకరి ముఖం మరొకరు చూసుకోవద్దని తరతరాలుగా వస్తున్న ఆచారం. ఈ కారణంగా కొత్త కోడళ్లు అత్తవారింటికి దూరమవుతారు. ఆషాఢ మాసం ప్రారంభానికి ముందే కోడళ్లు తమ పుట్టింటికి చేరుకుంటారు. ఇలా దూరంగా ఉండటం భార్యాభర్తల మధ్య ప్రేమానురాగాలు పెంపొందించడానికి ఎంతగానో దోహదపడుతుందని పెద్దలు చెబుతుంటారు.

ఫుడ్ సేఫ్టీపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

గీతం బాయ్స్ హాస్టల్లో తనిఖీలు


వంటకు వాడే నూనెను చెక్ చేస్తున్న అధికారులు

పటాన్‌చెరు టౌన్: మండలం పరిధిలోని రుద్రారంలో గీతం యూనివర్సిటీ బాయ్స్ హాస్టల్ మెస్‌ను ఆదివారం ఎఫ్ఎస్ఎస్ఏఐ బృందం, మొబైల్ ప్రయోగశాల(ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్) అధికారులు తనిఖీ చేశారు. హాస్టల్లో ఉపయోగించిన వంట నూనెను పరిశీలించి పరిమితి కంటే ఎక్కువ ధ్రువ గణన ఉండడాన్ని గమనించారు. అలాగే ఫంగస్ సోకిన కూరగాయలు, 224కిలోల గడువు ముగిసిన పచ్చి చికెన్, లేబిల్స్ లేని బిస్కెట్లు, చేపలు, గడువు ముగిసిన టీ, కాఫీ పౌడర్‌లను గమనించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆరోగ్యశాఖ మంత్రి, ఫుడ్ సేఫ్టీ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించడంతోపాటు బాధ్యులకు నోటీసులు ఇచ్చామని చెప్పారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు ఇతర ఆహార వ్యాపారులను హెచ్చరించారు.